జనావాసాల మధ్యలో ప్రమాదకరంగా గెడ్డ

- నడిచేందుకు కూడా దారి లేక ఇక్కట్లు
- తరచూ గెడ్డలో పడిపోతున్న పిల్లలు
- పట్టించుకోవాలని శ్రీరామ్‌నగర్ వాసుల విజ్ఞప్తి



నడిచి వెళ్లేందుకు ఇరుకు మార్గం



శ్రీరామ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో నుంచి ప్రవహిస్తున్న గెడ్డ

మద్దిపాలెం: ప్రభుత్వం ఒక పక్క ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినా.. కొన్ని ప్రాంతాల్లో సమస్యలు అలానే ఉన్నాయి. జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ పక్కనే ఉన్న శ్రీరామ్‌నగర్ కాలనీలో జనావాసాల మధ్య నుంచి ఓ గెడ్డ ప్రవహిస్తోంది. ఈ కాలనీలోకి వెళ్లాలంటే సరైన మార్గం కూడా లేదు. ఇరుగ్గా ఉన్న ఒక సందులో నుంచి వెళ్తే రెండు, మూడు మెట్లు, బస్తాలు వేసుకుని వాటి పైనుంచి గెడ్డ అంచు మీదుగా వెళ్లాలి. అంతే కాక గెడ్డకు అటువైపు ఉన్న ఇళ్లకు వెళ్లాలంటే స్థానికులు గెడ్డ మీద నుంచి తాత్కాలికంగా సన్నగా ఉన్న స్తంభాలను వేసుకుని దాటుతుంటారు. ఇంట్లో నుంచి ఏమాత్రం ఏమరుపాటుగా ఉండి వచ్చారో ఇక అంతే సంగతులు.. గెడ్డలో పడిపోయే ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పిల్లలయితే తరచూ గెడ్డలో పడిపోతుంటారని నివాసులు వాపోతున్నారు. రాత్రయితే పాములు, పురుగులు, పెద్ద తేళ్లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న గెడ్డ ప్రాంతంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని భయం భయంగా జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డ ఒడ్డునే తీసిన పూడిక..

తమ ప్రాంతానికి గతంలో చెత్త తీసేందుకు, యూజర్ చార్జీల వసూలుకు వచ్చే వారని, ఇప్పుడు ఎవరూ రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. శానిటరీ సెక్రటరీ ఎవరో కూడా తమకు తెలియదంటున్నారు. ఒక వేళ పారిశుధ్య కార్మికులు వచ్చినా.. గెడ్డలో తీసిన పూడికను దాని ఒడ్డునే వదిలేసి వెళ్లిపోతున్నారని, దాని నుంచి దుర్వాసన వస్తోందని, దోమలు, ఈగలు వృద్ధి చెంది ఆందోళన కలిగిస్తున్నాయని వాపోతున్నారు. గెడ్డలో చెత్త తొలగించి అలా ఎందుకు అక్కడే వదిలేస్తున్నారని పారిశుధ్య కార్మికులను ప్రశ్నించినా.. ఉలుకుపలుకు లేకుండా వెళ్లిపోతున్నారని శ్రీరామ్‌నగర్ వాసులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల, అధికారులు తమ సమస్యపై స్పందించి గెడ్డపైన పలకలు వేయించాలని, శాశ్వత పరిష్కారం చూపించాలని వారు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యలో గెడ్డతో ఇబ్బందులు

మా ప్రాంతంలో ఇళ్ల మధ్యలో గెడ్డ ప్రమాదకరంగా ఉంది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇదే పరిస్థితి. చిన్నపిల్లలు పడిపోతున్నారు. వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడిందంటే జారిపోతారు. పాములు, తేళ్లు వచ్చేస్తున్నాయి. అధికారులు, నాయకులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– సూర్యకాంతం, శ్రీరామ్‌నగర్

మా కాలనీ సమస్యను పరిష్కరించాలి

నివాసాల మధ్య ఉన్న గెడ్డ వల్ల నడవడానికి ఇబ్బందికరంగా ఉంది. పిల్లలు తరచూ దానిలో పడిపోతున్నారు. గెడ్డలో నుంచి ఎలుకలు ఎక్కువగా వచ్చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు మాగోడు పట్టించుకుని చర్యలు చేపట్టాలి.

– కృష్ణవేణి, స్థానికురాలు

గెడ్డ పనులకు గ్రీన్ సిగ్నల్



శ్రీరామ్‌నగర్ కాలనీ గెడ్డకు సంబంధించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను తెలుసుకుని, అంచనాలు వేయించాం. దానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. కాంక్రీట్ బాటమ్ వేయిస్తాం. త్వరలోనే టెండర్లను పిలుస్తాం.

– బర్కత్ అలీ, కార్పొరేటర్, 53వ వార్డు

క్లుప్తంగా

భోగాపురం ఎయిర్‌పోర్టుకు అప్పన్న పేరు పెట్టాలి



ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య సభ్యులు

మద్దిపాలెం: భోగాపురం ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరు పెట్టాలని సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి కోరారు. ఈ మేరకు బుధవారం మాధవధార కనకదుర్గా కల్యాణ మండపంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్న అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు పెట్టే విషయమై రాజ్యసభలో ప్రస్తావించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రచార సమైక్య సభ్యులు జీవీ రమణ, తమ్మినేని పద్మజ, మూల అప్పారావు, కూన రమణ, సనపల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉల్లాసం



క్రీడాకారులతో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: క్రీడలతో పిల్లలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. మాధవధార దేవస్థానం రోడ్డులో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఇందిరా గాంధీ మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ కోచ్ అమర్‌నాథ్ పిల్లలకు క్రీడలు నేర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ పిల్లలకు క్రీడల గురించి కోసం వివరించి రాణించాలని సూచించారు. అనంతరం విశాఖ డైయిరీ లెమన్ జ్యూస్, బిస్కెట్లు, ఉడికించిన కోడి గుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 291 సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ నందిని, శానిటరీ సెక్రటరీ జోసఫ్, శ్రీను, పార్టీ నాయకులు శ్యామ్, గణేష్, వినోద్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ. 2 వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సూర్యనారాయణ, సమితి సభ్యులు

కంచరపాలెం: గౌరీ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాల రహదారిలో ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి కాండ్రేగుల సూర్యనారాయణ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ఉపశమనానికి బాటసారులకు నిత్యం మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ చేస్తామని సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రాపేటి అప్పారావు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి ఎ.వి.రమణ, గౌరీ కళాశాల కరస్పాండెంట్ పొలిమేర సన్యాసినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్, ప్రెసిడెంట్ డి.కె.ఎ.సత్యనారాయణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో వలంటీర్ల పాత్ర కీలకం



షాదీఖానాలో వలంటీర్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న కె.కె.రాజు, బానాల, ఉషశ్రీ



46వ వార్డులో అతిథులతో పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- ఉత్తమ వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం అబిద్‌నగర్ షాదీఖానాలో జీవీఎంసీ జోన్–5 ఆధ్వర్యంలో బుధవారం 43, 44 వార్డుల వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసి మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా నిరుద్యోగ యువతను భాగస్వామ్యం చేస్తూ సచివాలయ/వలంటీర్ వ్యవస్థను స్థాపించారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, ఏపీడీ శైలజ, సీనియర్ నాయకులు హబీబ్, మహదాస్యం గోపి, బైరవెంకట్, గోపి, కాయల రామారావు, బషీర్, ప్రసాద్, రెడ్డి, శ్రీను, సీవోలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి

కంచరపాలెం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వలంటీర్ వ్యవస్థని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయ కర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదల చెంతకే పథకాలు చేరేలా సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. కటుమూరి సతీష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలను అటు అధికారులకు.. ఇటు ప్రజాప్రతినిధులకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. వలంటీర్లను శాలువాలతో సత్కరించి పురస్కారాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డిప్యూటీ మేయర్ సతీష్ తన సొంత నిధులతో వలంటీర్లకు మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. జోన్–5 ఏపీడీ కె.శైలజ, నాయకులు ఎస్.అప్పారావు, బి.గోవింద్, నరసింగరావు, కె.రామారావు, జి.అప్పారావు, అప్పలరెడ్డి, తారకేసు, వరలక్ష్మి, వి.శ్రీను, కృపా, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈ స్టేషన్‌ను సందర్శించి పలు ఫైళ్లను పరిశీలించారు. మహిళలు, వృద్ధులు పిల్లలకు సంబంధించిన కేసులపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ నేరాల్లో అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సీపీ వెంట డీసీపీ–2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.వి జయ్‌కుమార్, ఎస్ఐలు రవికిషోర్, షేక్ సమీర్, క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐలు సతీష్, పాపారావు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ ఎన్ లేఅవుట్, 11 కేవీ బీఎస్ లేఅవుట్, 11 కేవీ ఏపీ ఎస్ఈబీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్, శ్రీప్రకాష్ స్కూల్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వెనుక ప్రాంతం, బీఎస్ లేఅవుట్, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్, గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ సబ్ స్టేషన్ పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఆపరేషన్ ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బీఎండబ్ల్యూ షోరూం ప్రాంతం, షాదీఖానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక శాఖ కార్యాలయం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మద్దిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మద్దిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, హ్యాపీ హోమ్స్, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, 104 ఏరియా, సిద్ధార్థనగర్, గణేష్‌నగర్, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, శ్యామ్ నగర్ కాలనీ, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

మద్దిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ మద్దిపాలెం ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో భాగాంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతినగర్, గౌతమి గార్డెన్స్, మహారాణి వీధి, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం



జీవీఎంసీ కమిషనర్‌కు సాయికాంత్ వర్మకు శివాజీ పార్కు సమస్యలు వివరిస్తున్న వాకర్స్



స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జోన్–3, 5ల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కైలాసపురం, సాలిగ్రామపురం, డీఎల్బీ క్వార్టర్స్, అయ్యప్పనగర్, శ్రీనివాసనగర్, ఏఎస్సార్ నగర్, మురళీనగర్, మాధవధారతోపాటు శివాజీ పార్కు, బీచ్ రోడ్డులోని స్విమింగ్ పూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతోపాటు వీధి రోడ్లలో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. చాలా చోట్ల వీధులు, రహదారులపై వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ఆయా సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

శివాజీ పార్కు సందర్శన..

శివాజీ పార్కును కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. మరుగుదొడ్లు, నడక మార్గం, తాగునీరు, విద్యుత్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని ఆయనను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కమిషనర్ స్పందిస్తూ అత్యవసర పనులు త్వరితగతిన చేపట్టేందుకు టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులు పరిశీలించారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని, స్విమ్మింగ్ సామగ్రి అంతా సమకూర్చుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీడీహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై దాడులు ఆపాలి



అల్లూరి జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

సీతమ్మధార: నగరంలోని ఆటో కార్మికులపై ఆర్టీవో అధికారులు అక్రమంగా కేసులు నమోదు చేసి దాడులు చేయడం తక్షణమే ఆపాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద బుధవారం ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులపై అక్రమ కేసులు పెట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వి.కృష్ణారావు, నాయకులు కాటరాజు, నాయుడు, శ్రీను, సురేష్, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సార్ నగర్‌లో జీవీఎల్ పర్యటన



ఏఎస్సార్ నగర్‌లో పర్యటిస్తున్న ఎంపీ జీవీఎల్, విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో బుధవారం ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల కోసం 2019లో 480 ఇళ్లకు శంకుస్థాపన చేశామని, ప్రస్తుతం 280 ఇళ్లే ఇక్కడ నిర్మించారని తెలిపారు. నాలుగేళ్లు గడిచినా ఇంకా ఇళ్లు కేటాయించకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తర కన్వీనర్ సురేష్ బాబు, జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి శంకరరావు, మండల అధ్యక్షుడు కోరాడ వెంకటరమణ, వార్డు అధ్యక్షులు వీరబాబు, పూజారి ఆశీర్వాదం, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణ ప్రారంభం



తైక్వాండో శిక్షణను ప్రారంభిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: జీవీఎంసీ, విశాఖపట్నం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండో క్రీడలో శిక్షణ ఇస్తున్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో బుధవారం ఈ శిబిరాన్ని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. 5 నుంచి 16 ఏళ్ల వయసు బాలబాలికలు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు పి.మిథిలేష్, మిలింద్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల సందర్శన

మహారాణిపేట: జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భీమ్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. వైద్య సిబ్బందితో సమీక్షించి సూచనలిచ్చారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్



గ్లాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొని పెయింటింగ్ మెళకువలను అభ్యసిస్తున్నారు. ఆర్ట్ టీచర్ జి.శిరీష వీరికి వివిధ రకాల పెయింటింగ్ పద్ధతులను నేర్పిస్తున్నారు. బుధవారం గ్లాస్ పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షించారు.

- మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం మూడో రోజు చదరంగంపై శిక్షణ జరిగింది. చదరంగం క్రీడా శిక్షకుడు ఎస్.ఉమాపతి విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ పర్యవేక్షించారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

మద్దిపాలెం: ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు మాధవధారలోని ఎంఎస్ఆర్ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్న విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మెంటర్ హెచ్.వి.రమణ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26 లోపు ఎంఎస్ఆర్ గ్రంథాలయంలో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనాథ పిల్లల కోసం..

వివిధ వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్న నలుగురు బాలికలు



తయారు చేసిన వస్తువులు విక్రయిస్తున్న లక్ష్మీస్వాతి, లక్ష్మీ క్షీరజ, సాత్విక, హేమ

సీతమ్మధార: అనాథ పిల్లల కోసం నలుగురు విద్యార్థులు చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన స్వాతి ప్రమోటర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్‌రెడ్డి కుమార్తెలు లక్ష్మీస్వాతి, లక్ష్మీ క్షీరజ తోపాటు వారి స్నేహితులు సాత్విక, హేమ కలిసి స్వహస్తాలతో తయారు చేసిన కొవ్వొత్తులు, పెయింటింగ్స్, కీ చైన్స్, జ్యూయలరీ వస్తువులను పర్యాటకులు వచ్చే ఆర్కే బీచ్ మొదలగు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అలా వచ్చిన డబ్బును అనాథ పిల్లలు, విద్యార్థుల అవసరాల కోసం వినియోగించాలని నిర్ణయించారు. మొత్తం రూ.16,000 సేకరించారు. మధురవాడలోని అమ్మ ఒడి అనాథాశ్రమంలో ఉన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఇతర వస్తువులు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. చిన్నారుల మానవత్వాన్ని చూసి పలువురు అభినందిస్తున్నారు.

అలరించిన కథా కచేరి



మాట్లాడుతున్న రచయిత శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరి అందరినీ అలరించింది. ముందుగా ఇటీవల పరమపదించిన ప్రముఖ రచయిత కేతు విశ్వనాథ రెడ్డి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. సభకు అధ్యక్షత వహించిన రచయిత శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రచయితలు మానవ జీవన మనస్తత్వాలు మానవీయ విలువలు, కథల్లో చూపించి ఉదాత్తమైన రచనా శైలితో కథలు అందించాలని సూచించారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చెడును ప్రక్షాళన చేయాలన్నారు. రచయిత కె.జి.వేణు ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన 'వర్షం కురిసిన రాత్రి' కథానికను చక్కగా విశ్లేషించారు. రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన్న సూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు తమ రచనలు వినిపించారు.